సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 6 । ఆగస్టు । 2023

సాక్షి టాక్ షో
స్పెషల్ స్టోరీస్
సండే స్పెషల్



కరీంనగర్‌లో శ్రీచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థినులు



తిమ్మాపూర్ వాగేశ్వరి ఫార్మసీ విద్యార్థులు



స్నేహం.. ఓ వరం

- అనుకోకుండా పరిచయమై, జీవితాంతం తోడుంటుంది..
- కష్టనష్టాల్లో అండగా ఉండేవారే మిత్రులు
- నేడు స్నేహితుల దినోత్సవం

కరీంనగర్ సిటీ/విద్యానగర్(కరీంనగర్)/: 'స్నేహానికి కన్న మిన్న లోకాన లేదురా.. కడదాక నీడ లాగ నిను వీడిపోదురా' అని ఓ కవి అన్నట్లు స్నేహబంధం ఎప్పటికీ మనతోనే ఉంటూ మన జీవితంలో భాగమవుతుంది. అది ఓ వరం. పుట్టినప్పుడు మనతోపాటు ఎన్నో బంధాలు, రక్త సంబంధాలు ఏర్పడుతాయి. కానీ తర్వాత మన నడవడిక, వ్యక్తిత్వం ఆధారంగా స్నేహం మన జీవితంలోకి వస్తుంది. ఆపదలో ఆదుకుంటూ.. కష్టాల్లో పక్కనుంటూ.. ఎదుగుదలలో తోడుంటూ.. ఇలా రక్త సంబంధం చేయలేనిది కూడా స్నేహ హస్తం చేస్తుంది. మనం విజయం సాధించినప్పుడు చప్పట్లు కొట్టేవాళ్లు.. విషాదంలో ఉన్నపుడు ఓదార్చేవాళ్లు నలుగురు లేని జీవితాన్ని ఎవరూ ఊహించరు. అందుకే మనుషులందరికీ తలా ఓ పేరున్నప్పటికీ అందరినీ దగ్గరకు చేర్చేది మాత్రం స్నేహబంధమే. నేడు స్నేహితుల దినోత్సవం. ఈ సందర్భంగా కరీంనగర్‌లోని శ్రీచైతన్య డిగ్రీ కాలేజీలో 'సాక్షి' 40 మంది విద్యార్థులతో శనివారం చర్చావేదిక నిర్వహించింది. ఎక్కువ మంది ఆన్‌లైన్ స్నేహంలో మోసాలుంటాయని, నమ్మకం లేదని చెప్పారు. చిన్నప్పటి నుంచి ఉన్న స్నేహం బలంగా ఉంటుందని తెలిపారు.

పేరెంట్స్ తర్వాత ఫ్రెండ్సే..



పేరెంట్స్ తర్వాత ఫ్రెండ్సే ముఖ్యం. ఇంట్లో చెప్పలేని విషయాలు కూడా ఫ్రెండ్స్‌తో షేర్ చేసుకుంటాం. ఆపదలో ఒకరికి ఒకరు తోడుగా నిలిచేది ఫ్రెండ్సే. వారితో ప్రయాణం చాలా విలువైనది.

– అసాధ్య, ఫార్మ్ డీ, వాగేశ్వరి

ఒకరికొకరు తోడు..



స్నేహితులను ఎంచుకునే సమయంలో మంచి వారిని ఎంచుకుంటే జీవితంలో కష్టసుఖాల్లో తోడుంటారు. మంచి వారు ఎప్పుడూ ఒకరికొకరు తోడుంటారు.

– చందన, వాగేశ్వరి

స్వార్థం లేనిది..



నిస్వార్థమైనది స్నేహమొక్కటే. కష్టమొచ్చినా.. సంతోషమొచ్చినా తోడుండే వారే ఫ్రెండ్స్. నేను ఎక్కడో మహబూబాద్ జిల్లా నుంచి వచ్చిన. ఇక్కడ అందరూ అన్నదమ్ములుగా ఉండి స్నేహం విలువ తెలిపారు.

– ప్రశాంత్, వాగేశ్వరి

ఫ్రెండ్ అవసరమే..



ఆరు సంవత్సరాల ఫార్మసీ రంగంలో నాకు ప్రతీ ఫ్రెండ్ అవసరమే. కష్టసుఖాల్లో స్నేహితులే దేవుళ్లు. మా ఓర్పును భరించడమే కాకుండా జీవితంలో ముందడుగు వేయడానికి ప్రతీ స్నేహితుడు అవసరమే.

– అక్షయ, వాగేశ్వరి

విద్యార్థులే స్నేహితులు..



కళాశాలలో 20 సంవత్సరాల సుదీర్ఘకాలంలో మాకు విద్యార్థులను మించిన స్నేహితులు లేరు. ప్రతీ బ్యాచ్‌తో మాకు గొప్ప అనుభవం ఎదురవుతుంది. ఫ్రెండ్‌షిప్ విలువ తెలిసిన వారు జీవితంలో ఎదుగుతారు.

– శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఫార్మసీ కాలేజీ

– తిమ్మాపూర్

నాలుగో తరగతి నుంచి డిగ్రీ వరకు..



మేము నాలుగో తరగతిలో పరిచయమయ్యాం. మా ప్రయాణం ఇబ్బంది లేకుండా డిగ్రీ వరకు వచ్చింది. ఎంతో స్నేహంగా ఉంటూ సంతోషాలు, బాధలను పంచుకుంటాం. కష్టాల్లో ఒకరికొకరం అండగా ఉంటాం.– కీర్తిక, కేజీయా, కొత్తపేట, బోయినపల్లి మండలం

స్నేహితులకే చెప్పకుంటాం

తల్లిదండ్రులు, తోబుట్టువులు, బంధువులకు చెప్పుకోలేని చాలా సమస్యలను స్నేహితులతో చెప్పుకుంటాం. అనుకోకుండా పరిచయమై, జీవితాంతం నేనున్నా అంటూ వచ్చేది ఒక్క స్నేహమే.

– సుచరిత, శివాణి, పెద్దపల్లి



కష్టాల్లో ఆదుకునేలా ఉండాలి



స్నేహం కష్టాల్లో ఆదుకునేలా ఉండాలి. బాధలో ఉన్నప్పుడు మనసు విప్పి మాట్లాడితే సాంత్వన చేకూరుతుంది. ఒక మంచిమాటతో మనసును కుదుటపడేలా చేసి, ముందుకు నడిపించేది స్నేహమే. – భూమిక, జగిత్యాల

నమ్మకం.. నిజాయితీ ఉండాలి



నిజాయితీ, నమ్మకంతో కూడిన స్నేహం కావాలి. కానీ నేడు అవసరాలకు మాత్రమే చేస్తున్నారు. అవి తీరగానే దూరమైపోతున్నారు. జీవితాంతం తోడు నిలిచే స్నేహం ఆనందాన్నిస్తుంది.

– విద్య, తాళ్లపల్లి, ఇల్లంతకుంట మండలం

ఆ బంధం గొప్పది



స్నేహంలో ఆడ, మగ అనే తేడా ఉండదు. మన మంచికోరే వారితో ఫ్రెండ్‌షిప్ జీవితాంతం బాగుంటుంది. నేను ఎక్కువ సమయం స్నేహితులతోనే ఉంటా. స్నేహ బంధం ఎంతో గొప్పది.

– కృష్ణతేజ, వేములవాడ

నలుగురం కలిసి చదువుకున్నం



కోరుకంటి శ్రీకాంత్, తణుకు శ్రీనాథ్, సుంచు మల్లయ్య, నేను నలుగురం స్నేహితులం. శిశు తరగతి నుంచి ఇంటర్ వరకు కలిసే చదువుకున్నం. అప్పటి స్నేహం ఇంకా కొనసాగుతోంది. అందరం జీవితాల్లో స్థిరపడ్డాం. ప్రతీ వారం కలుసుకుంటం. పండుగలు, శుభకార్యాలకు ఒకరింటికి ఒకరం వెళ్తాం. కష్టనష్టాల్లో తోడుగా ఉంటున్నం.

– రావుల సుధాకర్, కిసాన్‌నగర్, కరీంనగర్

వైద్యానికి సాయం



బోయినపల్లి(చొప్పదండి): బూర్గుపల్లికి చెందిన అక్కరాజు గంగరాజుది పేద కుటుంబం. తల్లి పడుతున్న కష్టాన్ని చూడలేక ఇంటర్ వరకు చదివి ఆపేశాడు. చిన్నాచితక పనులు చేస్తూ తల్లికి సాయంగా ఉండేవాడు. నెల రోజుల క్రితం కాలేయ సంబంధిత వ్యాధితో ఆస్పత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న అతని స్నేహితులు పెరుక మహేశ్ వాట్సాప్ గ్రూపుల ద్వారా రూ.1.37 లక్షలు సేకరించి, చికిత్స చేయించారు.

స్నేహబంధమే శాశ్వతం



సాక్షి, పెద్దపల్లి: స్నేహబంధమే శాశ్వతం. ఇప్పటికీ నా స్కూల్‌మేట్స్‌ను కలుస్తుంటా. నా బెస్ట్ ఫ్రెండ్ అమూద్. వాడు నేను అహ్మద్‌నగర్‌లో స్కూల్, కాలేజీ వరకు కలిసి చదువుకున్నాం. సివిల్స్ ప్రిపేర్ అవుతున్న సమయంలో నాలో కాన్ఫిడెన్స్ తగ్గకుండా ఎప్పుడూ మోటివేట్ చేస్తుండేవాడు. అమూద్ ఇంజినీర్‌గా, మిగతా మిత్రులు వివిధ దేశాలు, పట్టణాల్లో డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా, ఉద్యోగులుగా, వ్యాపారులుగా స్థిరపడ్డారు. మేము ఎక్కడ ఉన్నా కష్టసుఖాల్లో పాలుపంచుకుంటాం. ఏటా టూర్ ప్లాన్ చేసుకుంటాం.

– వైభవ్‌గైక్వాడ్, పెద్దపల్లి డీసీపీ

8వ తరగతిలో పరిచయం



మేము ముగ్గురం 8వ తరగతిలో పరిచయమయ్యాం. డిగ్రీ వరకు కలిసే చదువుకున్నాం. ఏ సమస్య వచ్చినా చర్చించుకొని, పరిష్కరించుకుంటాం.

– కావ్య, వర్షిణి, తేజస్విని, వేములవాడ

మిత్రుడి పేరిట స్కూల్..



విద్యార్థులకు మెమొంటోలు అందిస్తున్న గాజుల శ్రీనివాస్, మిత్రులు (ఫైల్)



దయానంద్ (ఫైల్)

సిరిసిల్ల: పట్టణంలోని పద్మనగర్‌కు చెందిన గోసికొండ దయానంద్ 2002లో ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన యాదిలో చిన్ననాటి మిత్రులు ఏదైనా చేయాలని నిర్ణయించున్నారు. గాజుల శ్రీనివాస్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, యూఎస్‌ఏ సిరిసిల్ల పట్టణ శివారులో 22 గుంటల స్థలం కొనుగోలు చేసి, రూ.30 లక్షలతో 2006లో దయానంద్ మెమోరియల్ స్కూల్ స్థాపించారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఉచితంగా ఆంగ్ల మాధ్యమంలో విద్యనందిస్తున్నారు. రాజీవ్‌నగర్ కార్మిక క్షేత్రంలోని పేదవాళ్లు తమ పిల్లలను ఇక్కడికి పంపిస్తున్నారు. ప్రస్తుతం 65 మంది విద్యార్థులు ఉన్నారు. స్కూల్ నిర్వహణకు ఏటా రూ.5 లక్షలు ఖర్చవుతోంది. ఇందులో ఎక్కువ మొత్తాన్ని శ్రీనివాస్ భరిస్తున్నారు. బోడ రవీందర్, సిరిసిల్ల తిరుపతి, కట్కం గోపి, పయ్యావుల శ్రీనివాస్, బి.రాము, బొడ్డు శ్రీధర్, లింగమూర్తి, సిరిసిల్ల తిరుమలేశ్, వూరడి రవి, కోడం సుధాకర్ పాఠశాల నిర్వహణలో భాగస్వాములవుతూ స్నేహానికి నిజమైన నిర్వచనంగా నిలుస్తున్నారు.

ఊరి నుంచి గల్ఫ్ దాకా..



స్నేహితులతో దేవ్‌యాదవ్ (సర్కిల్‌లో)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని చింతకుంటకు చెందిన బైర దేవ్‌యాదవ్ ఉపాధి నిమిత్తం 12 ఏళ్ల క్రితం సౌదీ అరేబియా వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో సరైన పని దొరికింది. తన స్నేహితులు గ్రామంలోనే వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ ఆర్థికంగా ఎదగడం లేదని భావించాడు. ఒక్కొక్కరికి వీసా పంపిస్తూ 18 మందిని సౌదీ రప్పించుకొని, ఉపాధి చూపించాడు. చిన్నతనంలో గ్రామంలో అందరం కలిసి ఆడుకునే వాళ్లమని.. గల్ఫ్‌లో ఒకేచోట పని చేస్తుండటం ఆనందంగా ఉందని దేవ్‌యాదవ్ తెలిపాడు.

వైద్య మిత్రులు





పెంచలయ్య, పి.చంద్రశేఖర్, రమణారావు రిటైర్డ్ డీఎంహెచ్‌వో

సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన ప్రముఖ వైద్యులు పెంచలయ్య, రమణారావు, చంద్రశేఖర్ మంచి మిత్రులు. 40 ఏళ్ల క్రితం మెడిసిన్ చదువుతున్న రోజుల్లో ముగ్గురూ కర్నూలు మెడికల్ కాలేజీలో స్నేహితులయ్యారు. పెంచలయ్య కడప పట్టణానికి, ఎస్వీ రమణారావు నెల్లూరు జిల్లా సర్వేపల్లి మండలం నిడిగుంటపాలెంకు, చంద్రశేఖర్ నెల్లూరు పట్టణానికి చెందినవారు. ఎంబీబీఎస్ సెకండియర్ చదివే పెంచలయ్యకు ఫస్టియర్ చదివే రమణారావు, చంద్రశేఖర్‌ల మధ్య కాలేజీ ఫంక్షన్‌లో స్నేహం కుదిరింది. పెంచలయ్య, చంద్రశేఖర్ 1993లో సిరిసిల్లకు వచ్చి, ప్రాక్టీస్ ప్రారంభించగా.. 1995లో రమణారావు వచ్చారు. ప్రభుత్వ వైద్యులుగా సర్జన్ పెంచలయ్య, రిటైర్డ్ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఆర్థోపెడిక్ రమణారావు నిజాయితీకి మారుపేరుగా గుర్తింపు పొందారు.

సమాజంలో వరకట్న నిర్మూలన జరగాలి



మందులు పంపిణీ చేస్తున్న జడ్జి శ్రీనివాసరావు

గోదావరిఖనిటౌన్(రామగుండం): సమాజంలో వరకట్న నిర్మూలన జరగాలని జిల్లా అదనపు న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. మండల న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక 11వ డివిజన్ సంజయ్‌నగర్‌లో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వరకట్నం ఇవ్వడం గాని తీసుకోవడం కాని చేయరాదని అది నేరంగా పరిగణించబడుతుందని తెలిపారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విని ప్రకాశ్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమ శిక్షణతో పెంచాలని, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ సన్మార్గంలో నడిపించాలని కోరారు. అనంతరం సింగరేణి సేవా సంస్థ నిర్వహించిన మెడికల్ క్యాంపులో సుమారు 100 మందికి పైగా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎస్‌ఓటూ జీఎం రామ్మోహన్, కోర్టు ఏఓ శ్రీనివాసరాజు, సిబ్బంది శ్రీధర్, శంకర్, న్యాయవాదులు పాత అశోక్, సదన్‌కుమార్, సింగరేణి డాక్టర్లు సుమన్, రామలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం పట్టివేతపై అధికారుల విచారణ

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లుకు కేటాయించిన ధాన్యాన్ని అక్రమంగా ఇతర ప్రాంతానికి తరలిస్తున్న లారీని శుక్రవారం రాత్రి సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. శనివారం క్షేత్రస్థాయిలో రైస్‌మిల్లులో విచారణ చేపట్టారు. సివిల్ సప్లై డీఎస్‌ఓ ప్రేమ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాట్నపల్లి పరిధి సిరి రైస్‌మిల్లుకు ప్రభుత్వం ధాన్యం కేటాయించింది. ఈక్రమంలో 277 క్వింటాళ్ల ధాన్యాన్ని మిల్లు యజమాని అనుమతి లేకుండా హుజురాబాద్‌కు లారీలో తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు సివిల్ సప్లై అధికారులు పట్టుకొని సీజ్ చేశారు. అలాగే రైస్‌మిల్లుకు సివిల్ సప్లై ద్వారా కేటాయించిన ధాన్యం బస్తాలను లెక్కించడం జరిగిందని, దీనిపై పూర్తి నివేదికను అదనపు కలెక్టర్‌కు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి డేవిడ్‌రాజు, సివిల్ సప్లై అధికారులు రవీందర్, రాజేందర్ తదితరులున్నారు.



ధాన్యం బస్తాలను లెక్కిస్తున్న అధికారులు

డీ-86 కెనాల్‌కు నీటి విడుదల

సుల్తానాబాద్(పెద్దపల్లి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయగా, శనివారం సుల్తానాబాద్ డీ-86 కెనాల్‌కు చేరింది. ఆదివారం సుల్తానాబాద్ మండలం మీదుగా ఓదెల, శ్రీరాంపూర్ మండలాలకు ఎస్సారెస్పీ కాలువల ద్వారా చేరనుంది. దీంతో చివరి భూములకు సైతం పంటలు వేసుకునే అవకాశం ఉంటుంది. నీటి విడుదలతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సుల్తానాబాద్ కెనాల్‌లో ఎస్సారెస్పీ నీరు

తల్లిపాలే బిడ్డకు అమృతం

కోల్‌సిటీ(రామగుండం): నవ మాసాలు మోసిన తల్లి తన బిడ్డ ఈ లోకంలోకి అడుగు పెట్టగానే రోగ నిరోధక శక్తిని కానుకగా ఇవ్వడానికి తల్లిపాలను ఇవ్వాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి రావూఫ్‌ఖాన్ పిలుపునిచ్చారు. గోదావరిఖనిలోని జీజీహెచ్ ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల సదస్సుకు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, తల్లులను చైతన్యం చేసేందుకే ప్రభుత్వం తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసిన కేక్, లడ్డూలు, ఉప్మా, దోశ, మొలకెత్తిన గింజలు తదితర వంటల రుచులను ప్రదర్శించారు. కార్యక్రమంలో సీడీపీఓ స్వరూప, గైనకాలజిస్టు శ్రీదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎ.శిరీష, ఆదిష్‌రెడ్డి, పి.శిరీష, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి రావూఫ్‌ఖాన్

అమృత్ భారత్ రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవ ఏర్పాట్లు

రామగుండం: అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకంలో ఉమ్మడి జిల్లా పరిధిలో తొలి విడతలో రామగుండం, కరీంనగర్ రైల్వేస్టేషన్లు ఎంపికైన విషయం తెలిసిందే. కాగా ఆదివారం దేశవ్యాప్తంగా 508 రైల్వేస్టేషన్లను ఏకకాలంలో వర్చువల్ రిమోట్ విధానంతో ప్రధాని మోదీ ఢిల్లీలో ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ నేపథ్యంలో రామగుండం రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై భారీ స్క్రీన్ వేదిక ఏర్పాటుతో పాటు ప్రముఖులు హాజరు కానున్న క్రమంలో రైల్వే ఉన్నతాధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కాగా ప్రారంభ ఏర్పాట్లను రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్, రైల్వే సీఐ సురేశ్‌గౌడ్, ఎస్సై వెంకట్, ఏఎస్సై సుదర్శన్‌గౌడ్, రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ భానుచందర్ తదితరులు పర్యవేక్షించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

క్లుప్తంగా

11న మందకృష్ణ మాదిగ రాక


మాట్లాడుతున్న అంబాల రాజేందర్ మాదిగ

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈనెల 11న జిల్లాకు రానున్నారని ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ అంబాల రాజేందర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మాదిగ విశ్వరూప మహాసభ విజయవంతం కోసం గ్రామాల్లో నూతన కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభ విజయవంతానికి ఈనెల 11న పెద్దపల్లిలో జరిగే జిల్లా సన్నాహక సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పల్లె సుధీర్ మాదిగ, సంద్ర నాగచైతన్య మాదిగ, తాండ్ర అనిల్ మాదిగ, ఈదునూరి ప్రీతం మాదిగ, జోగు గాయత్రి, కల్వల భార్గవి, కల్వల అక్షయ, కనుకుంట్ల శ్రావ్య, ఆరెపల్లి త్రినయ్, పెరిక శ్రీవాణి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


రాజేందర్(ఫైల్)

పాలకుర్తి(రామగుండం): మండలంలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన కీర్తి రాజేందర్(27) చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహించే రాజేందర్ కొంతకాలంగా మద్యానికి బానిసై పనికి వెళ్లకుండా ఖాళీగా తిరుగుతుండటంతో అతడి తండ్రి నర్సయ్య ఈనెల 1న మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన రాజేందర్ అదే రోజు పురుగుల మందు తాగాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ పోలీసులు తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


వర్క్‌షాప్‌లో ఉత్సాహంగా పాల్గొన్న ఉద్యోగులు


ఉల్లాసంగా ఆడుతున్న మహిళా పోలీసులు

- రెండు రోజుల పాటు అలరించిన వర్క్‌షాప్
- మహిళా పోలీసుల్లో ఆత్మస్థైర్యం పెంపు దిశగా చర్యలు

గోదావరిఖని(రామగుండం): కమిషనరేట్‌లో రెండురోజుల పాటు కొనసాగిన వర్క్‌షాప్ మహిళా పోలీసు అధికారులు, సిబ్బందిలో ఉత్సాహం నింపింది. కమిషనరేట్ పరిధిలో హోంగార్డు నుంచి ఎస్‌ఐ స్థాయి అధికారులు, సిబ్బందికి నిర్వహించిన వర్క్‌షాప్ అలరించింది. సింధు హైదరాబాద్ సంస్థ లీడర్‌షిప్ ట్రెనింగ్, వర్క్‌లైఫ్ బాలెన్స్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, ఓవరాల్ వెల్నెస్‌పై అవగాహన కల్పించారు. మహిళా పోలీసులు ఉదయం మొదలు కొని రాత్రి వరకు సాగే ఉరుకుల పరుగుల జీవితంలో తామేమి చేస్తున్నాం, ఒత్తిడి తగ్గించుకునేందుకు ఏమి చేయాలి, వృత్తితో పాటు ఇంటి బాధ్యతలపై ఎలా దృష్టి సారించాలనే అంశంపై ఇచ్చిన శిక్షణ ఆకట్టుకుంది. అన్ని పోలీస్‌స్టేషన్లకు చెందిన మహిళా పోలీసులు అధికారులు, ఉద్యోగులు ఒకే చోటికి చేరి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. సీపీ రెమా రాజేశ్వరి ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఎప్పటికీ మర్చిపోమని మహిళా అధికారులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రణాళికతో ముందుకెళ్తే అన్నీ సాధ్యమే



ఒత్తిడి తగ్గించడానికి ఈవర్క్‌షాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఉదయం లేచిన మొదలు ఉరుకుల, పరుగుల జీవితంలో చాలా ఒత్తిడి ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈవర్క్‌షాప్ ద్వారా తాము ఎలా ముందుకు సాగాలో కొత్తవిషయాలు తెలుసుకున్నాం. అన్ని ఉద్యోగాల కన్నా పోలీసు ఉద్యోగం చాలా క్లిష్టతరమైన బాధ్యత. ప్రణాళికతో ముందుకెళ్తే అన్నీ సాధ్యమే. వర్క్‌షాప్ ఏర్పాటు చేసిన సీపీ మేడమ్‌కు కృతజ్ఞతలు. **– బి.సౌజన్య, వన్‌టౌన్ ఎస్‌ఐ**

సమయాన్ని మర్చిపోయాం



ఉద్యోగంలో చేరి 9ఏళ్లు అవుతోంది. ఇంత మంచి కార్యక్రమం ఎప్పుడూ చూడలేదు. సమయాన్ని మర్చిపోయి రోజంతా ఉత్సాహంగా గడిపాం. ఆటపాటల్లో పాల్గొన్నాం. హైదరాబాద్ నుంచి వచ్చిన బృందం సభ్యులు చాలా బాగా చెప్పారు. మహిళా అధికారులందరూ ఒకచోట కలుసుకోవడం ఆనందంగా ఉంది. సీపీ మేడమ్‌కు ధన్యవాదాలు. **– గంట ప్రవంతి, కానిస్టేబుల్, మంథని**

ఎలా లీడ్‌చేయాలో చెప్పారు



సమస్యలు వచ్చినప్పుడు ఎలా ఎదుర్కోవాలి, డ్యూటీలో ఏ విధంగా ఉండాలి, కుటుంబంలో ఎలాంటి పాత్ర పోషించాలనే అనేక విషయాలను చెప్పారు. ఉద్యోగం, కుటుంబం ఇలా ఒత్తిడి మధ్య జీవితాన్ని కొనసాగిస్తున్నాం. ఈ సమయాన్ని ఆనందమయం ఎలా చేసుకోవాలో నేర్చుకున్నాం. **– సుమలత, హెడ్‌కానిస్టేబుల్, వన్‌టౌన్**

మరింత ధైర్యం నింపేందుకే..



ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో బిజీగా గడిపే మహిళా పోలీసుల్లో మరింత ధైర్యాన్ని నింపేందుకే వర్క్‌షాప్ ఏర్పాటు చేశాం. వర్క్‌షాప్ అంశాలను సద్వినియోగం చేసుకుని సమర్థవంతంగా ఉద్యోగాల్లో రాణించాలి. ఒత్తిడి నుంచి బయటపడి ప్రణాళికతో ముందుకు సాగినప్పుడే లక్ష్యాలను సాధించవచ్చు. **– రెమా రాజేశ్వరి, పోలీస్ కమిషనర్**

నాన్నను బతికించండి

- కిడ్నీలు పాడై.. లివర్ దెబ్బతిని
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు
- దాతలు, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్న చిన్నారులు


కొడుకు, కూతురితో అంజనీప్రసాద్

ఎలిగేడు(పెద్దపల్లి): పేరుకే పెద్ద కులమైనా పేదరికంతో జీవనం సాగిస్తూ రెండు కిడ్నీలు, లివర్ పాడై చికిత్స కోసం దాతల సాయానికి ఎదురుచూస్తున్నాడు పాత అంజనీప్రసాద్. ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన పాత అంజనీప్రసాద్ ఆర్యవైశ్య కుటుంబంలో జన్మించాడు. అతడి భార్య 12 ఏళ్ల క్రితం మరణించగా కుమారుడు శివకుమార్, కూతురు వైష్ణవి ఉన్నారు. పిల్లలు చిన్నతనంలో ఉండగానే భార్య మృతిచెందడంతో కష్టపడి వారిని చదివించుకుంటున్న తరుణంలో అనారోగ్య సమస్యలు తలెత్తాయి. ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోగా కిడ్నీలు, లివర్ పాడైనట్లు ఏడాదిన్నర క్రితం వైద్యులు గుర్తించారు. చికిత్సకు దాదాపు రూ.30లక్షల వరకు అవుతాయని తెలిపారు. అప్పటి నుంచి ఇంటివద్దే ఉంటూ దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. గుంట భూమిలేక, శిథిలావస్థలో ఉన్న ఇంట్లో జీవనం సాగిస్తున్నాడు. అంజనీప్రసాద్ కొడుకు శివకుమార్ ఇంటర్‌లో 973 మార్కులు సాధించి బీటెక్ ఫస్టియర్ చదువుతుండగా, కాలేజీ ఫీజుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూతురు 6వ తరగతి చదువుతుంది. అంజనీప్రసాద్ అనారోగ్యంతో ఖర్చుల పాలై ప్రస్తుతం తినేందుకు తిండి, ఉండేందుకు సరైనా ఇల్లు లేదు. మందులకు నెలకు రూ.20 వేల వరకు ఖర్చుతోపాటు పిల్లలకు చదువుకోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

దాతలు సాయం చేయాలనుకునేవారు	పాత శివకుమార్ గూగుల్ పే, ఫోన్ పే: 957362364,
	ఎస్‌బీఐ బ్యాంకు అకౌంట్ నంబర్ 41008121976,
	ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్0021316

'పాఠశాలపై దుష్ప్రచారం సరికాదు'

గోదావరిఖని: తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని టీచర్ అకారణంగా దండించిందనడం సరికాదని యైటింక్లయిన్‌కాలనీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ టీచర్లు పేర్కొన్నారు. శనివారం స్థానికంగా ప్రకటన విడుదల చేశారు. సదరు టీచర్లు సాక్షితో మాట్లాడుతూ.. చిన్నారిని దండించారంటూ పాఠశాల సిబ్బంది చిన్నారిపై చేయిచేసుకుంటున్నారంటూ వచ్చిన ఫిర్యాదులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. కొందరు ఉద్దేశ్యపూర్వకంగా తమ ప్రతిష్టను దిగజార్చేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇలాంటి సత్యదూరమైన ఆరోపణలను పాఠశాల తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

పాలకుర్తి: పంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేకుంటే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కార్మికులతో కలిసి అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం ప్రకటించారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేసి కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే నాలుగు నెలల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, తాము అధికారంలోకి వచ్చాకా పంచాయతీ కార్మికుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పుట్నూర్‌లో కాంగ్రెస్ నాయకుల సమావేశం

మండలంలోని పుట్నూర్ గ్రామంలో శనివారం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో మక్కాన్‌సింగ్ సతీమణి మనాలిఠాకూర్ పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో మక్కాన్‌సింగ్ గెలుపుకోసం అందరూ పాటుపడాలని కోరారు.

ఆత్మగౌరవ సదస్సును జయప్రదం చేయండి

రామగుండం: హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో ఈనెల 20న నిర్వహించ తలపెట్టిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడ నారాయణరెడ్డి కోరారు. శనివారం అంతర్గాం ప్రెస్‌భవన్‌లో సదస్సు పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యమకారుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేసి రూ.పది వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. స్వాతంత్ర సమరయోధులుగా గుర్తించి, ఉద్యోగాల్లో 20శాతం కోటా అమలు చేయాలని కోరారు. అంగోతు శంకర్, సంపత్, సారయ్య, సురేష్, వేముల రాజ్‌కుమార్, మల్లేష్, రవీందర్ తదితరులున్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత


నియామక పత్రాలు అందజేస్తున్న జీఎం సుధాకర్‌రావు

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3 ఏరియాలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో మెడికల్ అన్‌ఫిట్ అయిన, మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు చెందిన ఐదుగురికి శనివారం జీఎం సుధాకర్‌రావు కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, ప్రస్తుతం ఉద్యోగం కోసం ఎన్నో పోటీ పరీక్షలు రాసినా, వివిధ సంస్థల్లో ప్రయత్నాలు చేసినా రాని సందర్భాలు నెలకొన్నాయన్నారు. సింగరేణిలో కుటుంబ వారసత్వంగా వచ్చిన ఉద్యోగం దేవుడు ఇచ్చిన వరంలాంటిదని, ఉద్యోగంలో చేరినవారు క్రమ శిక్షణ, రక్షణతో పని చేసి భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, అధికారుల సంఘం ప్రతినిధి నాగేశ్వరరావు, అధికారులు శ్రీనివాసులు, రాజేందర్, రవీందర్‌రెడ్డి, శ్రీహరి, లక్ష్మీనారాయణ, రాజేశం తదితరులున్నారు.

క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌వోటూ జీఎం రఘుపతి

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు సెంటనరీకాలనీలో క్వార్టర్ల కేటాయింపునకు శనివారం జీఎం కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. కొత్తవారికి, క్వార్టర్ల మార్పు కోసం దరఖాస్తు చేసుకున్న ఆరుగురు అధికారులు క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. కొద్ది రోజుల్లో కేటాయింపు పత్రాలు అందిస్తామని ఎస్‌వోటూ జీఎం రఘుపతి తెలిపారు. కార్యక్రమంలో అధికారులు రవీందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీ ఫెస్టివల్‌కు హాజరైన రఘువీర్‌సింగ్


లైబ్రరీ ఫెస్టివల్‌లో రఘువీర్‌సింగ్ తదితరులు

పెద్దపల్లిరూరల్/జూలపల్లి: దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న లైబ్రరీ ఫెస్టివల్ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ హాజరయ్యారు. కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదిముర్ము హాజరై గ్రంథాలయాలు దేశస్వాతంత్రోద్యమ కాలంలో ఎంతో ఉపకరించాయని పేర్కొన్నారని రఘువీర్‌సింగ్ తెలిపారు. రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ ఆయాచితం శ్రీధర్‌తో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి చైర్మన్లు హాజరయ్యారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



మాట్లాడుతున్న అశోక్

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ అన్నారు. శనివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీలో కాంట్రాక్ట్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నం. 22ను వెంటనే గెజిట్ చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసిన విధంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను కూడా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. సమావేశంలో రమేష్, దుర్గేష్, బాబు, శంకరమ్మ, లక్ష్మి, సుభద్ర, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు మంచర్ల రాజేశ్వరి, ముక్కెర సమిత రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం మురళీనాయక్ తెలిపారు. పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ మైదానంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను ఎంఈఓ సురేందర్ అభినందించారు.

ఓదెల మండలంలో ముగ్గురు..


విష్ణు


వినయ్

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని కొలనూర్ హైస్కూలుకు చెందిన వి.వినయ్, కె.విష్ణు, ఆర్.శ్రావ్యశ్రీ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 3న పెద్దపల్లిలో నిర్వహించిన పోటీల సెలెక్షన్స్‌లో సీనియర్ విభాగం జావలిన్ త్రోలో వినయ్, అండర్–14 విభాగంలో విష్ణు, బాలికల విభాగంలో శ్రావ్యశ్రీ సత్తాచాటారు. ఈనెల 7న జేఎన్ స్టేడియం వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈసందర్భంగా విద్యార్థులను ఎంఈవో ఆరెపల్లి రాజన్న, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీఈటీ ప్రణయ్ అభినందించారు.

సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాక్‌లు కేటాయించాలి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని/జ్యోతినగర్: బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే కేటాయించాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. శనివారం అసెంబ్లీలో ఈవిషయాన్ని ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రకు యోచిస్తోందన్నారు. అలాగే ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించారు. 2018లో ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికులకు అగ్రిమెంట్ చేయడం జరిగిందని, నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్నా వేతన ఒప్పందం అమలు చేయడంలో యాజమాన్యం జాప్యం చేస్తుందని ఆరోపించారు. రీజినల్ లేబర్ కమిషనర్ సూచనలు సైతం పాటించడం లేదన్నారు. కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలని అసెంబ్లీ సాక్షిగా తన గళం వినిపించారు.

మంథని డిపో ఎదుట కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న కార్మికులు

మంథని: మంథని ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. శనివారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి గేటు ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేసే బిల్లుకు ఆమోదం తెలుపాలని గవర్నర్‌ను కోరారు. కేకే రెడ్డి, ఏవీఆర్ రెడ్డి, ఎస్ గోపాల్, రఘుపతి, ఖాదర్, జీపీ రెడ్డి, రాజేశ్వరి, రజిత, పీకే రావు, శంకర్, రమేష్ తదితరులు ఉన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


శ్రీకాంత్ (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని బస్టాండ్ వద్దగల లాడ్జిలో శనివారం గుర్రాల శ్రీకాంత్ (29) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. మంథనిలోని పోచమ్మవాడకు చెందిన శ్రీకాంత్ జైపూర్‌లోని పవర్‌ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా గోదావరిఖనిలో నివాసముంటున్నాడు. ఆన్‌లైన్ ఆటలాడి పెద్ద మొత్తంలో డబ్బు పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడు. ఏం చేయాలో పాలుపోక పెద్దపల్లి బస్టాండ్ వద్ద గల లాడ్జి లో గది అద్దెకు తీసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. శ్రీకాంత్‌కు భార్య సాహిత్య, పాప ఉన్నారు.

మనోవేదనతో ఒకరు..

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి పిట్టలఎల్లయ్యపల్లె గ్రామానికి చెందిన అన్నవేని ప్రమీల(62) శనివారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై శ్రీధర్ కథనం ప్రకారం.. ప్రమీలకు ఇద్దరు కూతుళ్లు సంతానం. ఇద్దరికీ రేచీకటి ఉండటంతో మనోవేదనకు గురై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త కనుకయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నదిలో దూకి వృద్ధురాలు..

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరిఖనికి చెందిన మాడిశెట్టి వీరమ్మ(70) గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. వీరమ్మ కొద్దిరోజులనుంచి తీవ్రమైన రక్తపోటు, థైరాయిడ్ తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. శనివారం ఉదయం ఇంటినుంచి బయటకు వెళ్లి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.